# ప్రేమ

కె. నాగలక్ష్మి

'కృష్ణా'

......

'Just a minute. నే కూడా వస్తున్నా.'

'నాతో రావటానికి నువ్వెవరివి? నే పోతున్నా' విసురుగా వచ్చింది సమాధానం.

వెనకనుంచీ పరుగెట్టుకుని వచ్చింది ప్రేమ.

'నాతో రావద్దన్నానా?'

'నీతోటే వస్తానన్నానా?'

'ఎందాకా? మీ కాలేజీ వేరు-మా కాలేజీ వేరు.'

'మీ కాలేజీ పక్కనే మాది. నీ పక్కనే నేను.'

'ప్రేమా! ప్లీజ్-నన్నింకా రెచ్చగొట్టకు, ఇలాటి మాటలు చెప్పే నన్నింతదాకా తెచ్చావు. ఇకనైనా నా దారిని నన్ను పోనియ్యి.'

'నీ దారి నీదేనయ్యా కృష్ణ ప్రభూ! నే చెప్పింది నీ కదే నీది నా దారి కాదు. నాది నీ దారి కాదు అని. అర్థం కాలా?'

'నీ ధోరణి నీదే కాని, నన్నర్థం చేసుకోవన్న మాట.'

'ఇంకా ఏం అర్థం చేసుకోవాలి కృష్ణా? నీలో ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. నువ్వే ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడం లేదు.'

'Yes Madam ఒప్పుకున్నాం. నువ్వే చాలా తెలివైన దానివి. మరి ఇంతకాలం నుంచీ నన్నెందుకు మోసగించావో అర్థం కాకుండా ఉంది. నన్నింత ఆవేదనకు గురిచేసిన నిన్ను...నిన్ను...'

పకాలున నవ్వింది ప్రేమ "...నన్ను...నన్ను ఏం చేస్తావు?'

'Shoot చేస్తాను. కసి తీరేట్టుగా గురి చూసి.'

'బాబోయ్. నన్ను చంపినా పర్వాలేదు కానీ కృష్ణా! పోలీసులు నిన్ను పట్టుకెళ్తారే...పాపం!'

'పట్టుకెళ్తే వెనకే వెళ్తాను. నీకేం నష్టం?...

'నాకేం లేదు. నేనంతకు ముందే లోకాన్ని విడిచేసి వుంటాను కదా! మీ అమ్మ వాళ్ళకే నువ్వంటే బోలెడు కష్టం వస్తుంది. అదీకాక...'ఇంకా ఏదో చెప్పబోతూనే వుంది ప్రేమ.

'అదిగో మీ కాలేజీ. దయచెయ్యి లోపలికి.'

'అలాగే కానీ సాయంత్రం ఒక్కసారి అలా వెళ్దామా?'

"ఎలా వెళ్దాం? నాతో వస్తావా? అభ్యంతరం లేదా?'

దెబ్బతిన్నట్టు చూసింది ప్రేమ.

'మూడున్నరకి వచ్చేస్తాను. Last hour Public Gardens కి వెళ్దాం. నీకు వీలవుతుందా?'

'అలాగే. Bus stop లో ఎదురు చూస్తుంటాను. అదిగో మీ మూడు జడల ఫ్రెండ్ వస్తోంది. నే వెళ్తున్నా.' గబగబా నాలుగడుగులు వేశాడు. 'నీతో Public Gardens కి కాదు ప్రేమా! నరకానికి రమ్మన్నా వస్తాను.' త్వరత్వరగా వెళ్ళిపోయాడు అక్కడనుంచీ.

o • o

"హాయ్ ప్రేమ్! ఇక్కడ నిలబడ్డావేమిటి?"

"ఏం లేదే. నీ కోసమే. నిన్ను చూపించి మా కృష్ణ పరుగెట్టి పోయాడు."

"అదేలా? భయమూ నేనంటే?"

"భయమో-భక్తో నాకు తెలియదు గానీ - పద లోపలికి."

"ఇవ్వాళ practicals లేవు కదా! Mrs హర నాథ్ class..."

"అరెరే! అవును కదూ! నే మర్చిపోయా. అన్నీ మోసుకొచ్చాను."

"చూస్తూ చూస్తోండగానే కాలం ఎంత త్వరగా గడిచి పోతుంది. అప్పుడే మనం ఫైనలియరు కొచ్చేశాం."

"అవును నల్లూ! అదే నాకు బాధగా వుంది. ఇక్కడితో మన జీవితంలోని తీయని భాగం ముగిసి పోతుంది. తర్వాతన్నీ బరువులూ...బాధ్యతలూ... ప్చ్."

"నీకు బరువుగా, బాధగా ఎందుకని పిస్తుంది ప్రేమా? కృష్ణ నిన్ను అపరూపంగా చూసుకోడూ?"

"కృష్ణ విషయంలో నేనొక అభిప్రాయానికి వచ్చే శాను నల్లూ! చెప్పమంటావా?"

'నువ్వీనాడు కొత్తగా నిర్ణయించేది ఏముందీ? పరీక్షలవగానే పూలదండలు మార్చుకుని ఇద్దరూ హాయిగా హానీమూన్‌కి...'

'ప్లీజ్. ఆపెయ్యి. హానీమూన్‌కి వెళితే వెళ్తానేమో గానీ...కృష్ణతో మాత్రం కాదు' తల వాల్చేసింది ప్రేమ.

'నీకు మతిపోయిందా ప్రేమా? స్పృహలో ఉండే మాట్లాడుతున్నావా?' ఆశ్చర్యంగా మందలింపుగా అంది సాలెహా.

'నిజం నల్లూ! బాధగా ఉన్నా ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు.'

'ఇంత హఠాత్తుగా ఏమిటీ నిర్ణయం? ఎవరిచ్చారు సలహా?...'

ఎవరో ఎందుకిస్తారు నల్లూ. ఇవ్వవలసిన వాళ్ళే. ఉన్నవీ లేనివీ కూడా కల్పించి...' బొంగురు పోయింది ప్రేమ కంఠం. 'నాతో చెప్పవూ? ఏం జరిగింది?' అర్ధ్రంగా అడిగింది సాలెహా.

"చెప్తాను. నీకు కాక మరెవ్వరికి చెప్తాను?" క్షణం ఆగింది. ''క్లాసుకి టైమయిందిగా. మరో సారి తీరిగ్గా మాట్లాడుదాం. మనం మానవులం నల్లూ! కాలం నిర్ణయించే తీర్పుకి కట్టుబడక తప్పదు." సాలెహా జవాబేం యివ్వలేదు. మౌనం గానే ఇద్దరూ క్లాసుకెళ్ళారు. యాంత్రికంగా లెక్చరు వింటోంది సాలెహా. అతి ప్రయత్నం మీద కూడా ఫాలో అవలేక పోతోంది ప్రేమ.

o o o

'ప్రేమా 'అసహనంగా ఉంది కృష్ణ పిలుపు.

'ఊఁ.' అంది దిక్కులు చూస్తూ ప్రేమ. కళ్ళలో తడి అంతా ఆరిపోయి పొడిగా ఉన్నాయి. కాటు కంతా కరిగిపోయింది.

'చెప్పు. ఏమిటో మాట్లాడాలన్నావు కదూ!'

'అందుకేగా ఇక్కడికి వచ్చింది! చెప్తాను కృష్ణా! క్షణం స్థిమితంగా ఆలోచించనీ. నన్ను తొందర పెట్టకు.'

'నాతో స్నేహం మొదలు పెట్టే ముందే ఆలోచించ లేదా ప్రేమా? ఇప్పుడీ ఆఖరు క్షణంలో ఏ మాలో చిస్తావు?'

'స్నేహానికి ఆలోచన ఎందుకు కృష్ణా? మర్యా దస్తుడివి, మంచి మనసున్న వాడివి. అందునా డాక్టరువి. నీలాటి వాళ్ళతో ఎప్పుడే అవసరం వస్తుందో...'బలవంతంగా నవ్వింది ప్రేమ.

'ఛ ఛ—బొత్తిగా సీరియస్‌నెస్ లేదు. ప్రతీదీ నవ్వులాట క్రిందే తేల్చేయాలని చూస్తావు. జీవిత సమస్య అంటే కాస్త sincere గా ఆలోచించాలి ప్రేమా! నీకీ పసితనం ఎలా పోతుందో...'

'వనితనం యింకా ఎక్కడుంది? వండు ముసలి తనం వచ్చేస్తోంటే...'

'సరే. ఈ కబుర్ల కేమొచ్చె? చెప్పాలన్నదేమో త్వరగా చెప్పు.'

'చెప్పటానికే ముందీ? మా యింట్లో వాళ్ళకి నిన్ను చేసుకోటం ఇష్టం లేదు.'

'బోడి యిష్టం. వాళ్ళ ఇష్టం ఎవరిక్కావాలి? వాళ్ళనెందు కడిగావు?'

'అదికాదు కృష్ణా! నే పెళ్ళి చేసుకోవటమే వాళ్ళ కిష్టం లేదు. నాన్న త్వరలో రిటైర్ అవుతారుకదూ! ఇంటినిండా చిన్నపిల్లలు. నేకూడా వెళ్ళిపోతే వాళ్ళ నెవరు చూస్తారు?'

'ఏం మీ అన్నయ్య లేడూ? తాడి చెట్టల్లే అంత పొడుగ్గా '

"బావుంది. వాడి సంసారం వాడికి లేదూ? భార్యా, పిల్లలూ, అత్తగారూ, మామగారూ .."

"చాల్లే. కుటుంబ భారం వహించ వలసింది ఆడపిల్లా, మగపిల్లాడా ఇది చెప్పు."

'అవునయ్యా మగవాడే. కానీ వదినా వాళ్ళ నాన్నగారు పదివేలిచ్చి అన్నయ్యను కొన్నారు. న్యాయం ఆలోచించు. డబ్బిచ్చి కొనుక్కున్నది మనది కాకుండా ఎలాపోతుంది? అయినా అమ్మలో కూడా తప్పుంది కృష్ణా! ఎలా చేసినా వంకలుపెడితే చిరాకు కదూ!" "మీ వదిన మంచిదేనా?"

"పెద్దది మాత్రం కాదు. పరాయి పిల్ల మనని నమ్మి మన యింటికి వచ్చినప్పుడు-ఎంత ఆదరణగా చూడాలి? అందునా వదిన వాళ్ళకి ఒక్కత్తేకూతురు. గారాబంగా పెరిగింది. ప్రతిదానికి అమ్మచేసే అజమాయిషికి కష్టపెట్టుకుని వెళ్ళిపోయింది. వాళ్ళ నాన్నొచ్చి అన్నయ్యని కూడా తీసుకుపోయాడు. ఇప్పుడు అమ్మా, నాన్నా ఒకరిమీద ఒకరు నిందలు వేసుకుంటా రంతే. మొత్తానికి అన్నయ్య మీద ఆశలుంచ కొని లాభం లేదు.

"అందుకని? నీ జీవితం త్యాగం చెయ్యాలా? వద్దు ప్రేమా! నువ్వు నా దానవయ్యాక వాళ్ళు పరాయి వాళ్ళవుతారా? నీతోటి వాళ్ళనికూడా...'

"వద్దు. వద్దు కృష్ణా! అది అమానుషం. నా కంఠంలో ప్రాణం ఉండగా ఆ పని చెయ్యలేను.'

"నే నది బరువుగా తీసుకోను ప్రేమా? ఇష్టంతోనే కదా!"

''నువ్వంటున్నావు సరే! నీకు కష్టం కాకపోవచ్చు కానీ, నాకు మాత్రం వాళ్ళందరూ నా సంసారంమీద పడి తినటం ఇష్టం లేదు."

''అందుకని అసలు నువ్వు సంసారమే ఏర్పర్చుకోను అంటావా? ఇది మాత్రం భావ్యమా చెప్పు.

''నువ్వూ, నేనూ భావ్యం కాదు అనుకుంటే ఏం లాభం కృష్ణా? అందరూ అనుకోవద్దూ?"

"ఎవరికోసమో నువ్వెందుకు బాధపడాలి ప్రేమా చుట్టూ ఉన్న వాళ్ళందరినీ తృప్తి పరచటం ఎవరికైనా సాధ్యమా? అందరికీ భయపడితే ఎలా చెప్పు?"

'భయపడటం కాదు కృష్ణా! నువ్వర్థంచేసుకోటానికి ప్రయత్నించటంలేదు. ఆలోచిస్తే నీ కర్థం కానిదేం ఇందులోలేదు. మనం ఎంతో పురోగమించాం అది సాధించాం, ఇది సాధించాం, అని గొప్పగా చెప్పుకోవటమేగానీ నిజానికి ఎక్కడివాళ్ళం అక్కడే ఉన్నాం. మన మనస్తత్వాలు ఒక్క అంగుళం కూడ ఎదగలేదు. ఉపన్యాసాల్లో వినటం, పుస్తకాల్లో చదవటం తప్పించి వర్ణాంతర వివాహ మన్నది ఇంకా వింతగా చెప్పుకునే విషయంగానే వుండి పోయింది.

"నువ్వు అనవసరంగా లెక్చరు దంచకు వింటున్నాను కదా అని. ఆంధ్రలో ఆవకాయంత Common అయిపోయింది వర్ణాంతర వివాహం ఈ రోజుల్లో. మొన్న రామశాస్త్రి రాజీని పెండ్లిచేసుకోలేదూ? మన స్కూల్లో అన్నపూర్ణమ్మ టీచరు భర్త ఎవరు? హరిజన్ కదూ"

'నీ కళ్ళముందు కనపడేదే ప్రపంచం కాదుకృష్ణా అదింకా చాలా విస్తృతంగా ఉంది. నూటికి పదిమంది నయినా చూపించగలవా నువ్వు అన్నపూర్ణమ్మగారిని సమర్థించిన వాళ్ళని?"

'.........'

'ఎవరి సానుభూతి లేకపోయినా నాకేం ఫర్వా లేదు, కానీ నా వెనుక ఇంకా ఆడపిల్లలు ఉన్నారు వాళ్ళపెండ్లిళ్ల ఎలా అవుతాయి? జీవితాంతం నావల్ల పునూరు మనరూ వాళ్ళు? అలాంటప్పుడు నేనుమాత్రం నవ్వుతూ సుఖంగా ఎలా వుండగలను?'

'ఆ కాలానికి ఎన్ని మార్పులొస్తాయో ఊహించ గలవా నువు? ఇప్పట్నుంచి ఎందుకు అవశకునాలు అనాలి?'

మార్పులు...ఏం మార్పులు ఆశిస్తావు కృష్ణా ? ధనవంతులింకా ధనవంతులౌతారు, దరిద్రులింకా దరిద్రులౌతారు. ఆకలితో మండేవాళ్ళ ఆలోచనలు అందంగా ఎలా వుంటాయి కృష్ణా? నువ్వింకా పసి వాడివి అందుకే ఏదీ అర్ధంచేసుకోలేక పోతున్నావ్."

"మరేం పసివాడిని ఒళ్ళో పడుకోబెట్టుకొని జోకొట్టు.'

పక పకా నవ్వింది ప్రేమ.

'నీకు నవ్వెలా వస్తుంది ప్రేమా? ఆసలేం బాధగా లేదా?'

'ఒక్కసారి నా కళ్ళలోకి సూటిగాచూడు కృష్ణా నన్నీ ప్రశ్న అడగటానికి నీకెంతధైర్యం?' తలెత్తి చురుగ్గా చూసింది.

'ప్రేమా!..ఆడపిల్లలాగా దీనంగా చూకాడుకృష్ణా. నీ కళ్ళలోకిచూస్తూ ఉండే నన్నునేను నిగ్రహించుకో లేను. నీకు దూరంగా ఒక్క-క్షణం-క్షణంలో కాస్త భాగం కూడా ఉండలేను కాని నువ్వు...ఇదేం గమ నించనట్టు హాయిగా తిరుగుతావు.'

"తాయిలం లేదురా బాబ్బూ!, అన్నా వినకుండా కొంగుపట్టుకు నుంచున్న పసివాడికేసి తల్లిచూసినట్టు చూసింది ప్రేమ. నిర్వికారంగా నవ్వింది...హాయి వ్వ్! నువ్వులేని నా జీవితంలో హాయి మాత్రం ఎలా ఉంటుంది. కృష్ణా! ఎండమావిలా వెక్కిరిస్తుంది. అంతే!"

'.........'

'నువ్వు ఎవరినైనా మంచి అమ్మాయినిచూసి పెళ్ళి చేసుకో కృష్ణా!

'నీ సలహా నాకేం అక్కర్లేదు' కోపంగా అన్నాడు కృష్ణ. ప్రేమని రెండు చేతుల్తో బంధించి 'నిన్ను శాశ్వత వివాహం చేసుకుంటాను అప్పుడేం చేస్తావు?" అన్నాడు.

'నాకిష్టం లేందీ నువ్వేమీ చెయ్యలేవు ఎందు కొచ్చిన కంఠశోష కృష్ణా! ఇది పెద్దమనిషి తరహా కాదు. వదిలెయ్యి.'

ఊహుం! నువ్వొట్టి మొండి ఘటానివి. వదిలేస్తే పారిపోతావు నేను దిక్కులేని వాడిని అయిపోతాను.

'నరేలే పొద్దుపోయింది ఇక ఇంటికి పోదాంపద.'

'నేరాను. నువ్వుపో! దూరంగా నెట్టేశాడుప్రేమను

చీరకంటిన దుమ్ము దులుపుకుంటూ లేచింది ప్రేమ. పుస్తకాలు చేతిలోకి తీసుకుంది, శూన్యంలోకి చూస్తున్నాడు కృష్ణ, "లే కృష్ణా చీకటిగాఉంది ఒంట రిగా పోలేను. అంటూ చెయ్యి అందించింది,

'ఈ కాస్త చీకటికే భయపడే దానిని-జీవితాన్నే చీకటి చేసుకుంటున్నావు. కదా ప్రేమా! ఒంటరిగా ఎలా వుంటావో ఏమో!! దిగులుగా నిట్టూరుస్తూ ప్రేమచెయ్యి అందుకుని లేచాడు కృష్ణ,

కాలచక్రానికి ఉన్నంతవేగం ఇకదేనికి లేదేమో! ఎవరి ఆలోచనతోనూ, ఆవేదనలతోనూ నిమిత్తం లేకుండా యాంత్రికంగా తిరిగి పోతూ ఉంటుంది. కొందరిని కసిగా కాలరాసేస్తుంది. మరి కొందరికి రంగుల రాట్నంలా అహ్లాదంగా ఉంటుంది,

ప్రేమకి చిన్నతనం చిలిపితనం పోయి హుం దాగా తయారయింది, ఉద్యోగంలో ఒకమెట్టు పైకి

ఎక్కింది, కాస్త లావయిందేమో ఒక ఛాయ మెరుగ్గా కనబడుతోంది. అద్దంముందు నిలబడి బొట్టుపెట్టుకుంటూంటే వెండి దారాల్లాగా రెండు నెరసిన వెంట్రుకలు నుదుటిమీద పడి కవ్విస్తున్నాయి. అందమైన చీరలు కట్టుకుని క్రోటన్ మొక్కలాగా అందంగా కనబడే ప్రేమంటె ఆఫీసులో చాలామంది అమ్మాయిలకి అసూయ వాళ్ళనిచూస్తే జాలి ప్రేమకి,

ఒకరోజు...Bus stopలో ఒకతను నిలబడి ఉన్నాడు, హుందాగా అందంగా కన్పిస్తున్న అతను అతను...ప్రేమకి మతిపోయింది, ఇంతలో అతను చూడనే చూశాడు, దగ్గరకువచ్చి చిన్నగా నవ్వాడు,

ఎంత అదృష్టం ప్రేమా! ఇన్ని సంవత్సరాల తర్వాత నిన్ను' అతనికి మాటలు పెగలటం లేదు,

ప్రేమ...తను చేజేతులా కూలదోసుకున్న బంగారు స్వప్నాన్ని కళ్ళారా చూస్తూ సర్వం మరచిపోయింది

'ఏమిటోయ్ నీ పరధ్యాన్నం నువ్వేను నన్ను గుర్తించలేదేమిటి ఖర్మ.

'అబ్బే! నిన్ను మరచిపోవటం ఏమిటి? ఎన్నాళ్ళకెన్నాళ్ళకి కృష్ణా! దొరికిన అవకాశాన్ని క్షణంకూడ పోగొట్టుకోటానికి ఇష్టపడటం లేదు, నాకళ్ళు నిన్ను చూసిన ఆనందంలో మనసు మూగబోయింది.'

'భలే బావున్నావే ప్రేమా మునుపటికన్నా అందంగా తయారయ్యావు, నీ పెళ్ళికయినా పిలవలేదేం మీ ఆయన ఏంచేస్తారు?"

క్షణం విస్తుపోయింది ప్రేమ. వెంటనే తేరుకుంది

"మా ఆయన నీలా డాక్టరే కృష్ణా! సరేగాని మీ ఆవిడెలా వుంది?"

పకపకా నవ్వాడు కృష్ణ 'మా ఆవిడకేం దర్జాగా ఉంది పట్టుచీరలో, ఒంటినిండా నగలలో కళకళలాడుతూ లక్ష్మిలా ఉంటుంది. నీకిచ్చిన అవకాశం నువ్వు వాడుకోక పోవడమే మంచిదైంది."

నవ్వుతున్న ప్రేమ వదనం చిన్నబోయింది 'అయితే సుఖంగా ఉన్నావన్నమాట!' నిట్టూర్చింది ప్రేమ

'నిక్షేపంలా ఉన్నాను గానీ, అదిగో మా బస్సు మరి పోనా?"

జవాబు ఆశించకుండానే బస్సెక్కేశాడు కృష్ణ.

అసలు ప్రేమ అనే అనుభూతే చిత్రమైనది చల్లని వెన్నెలలా హృదయానికి ఆహ్లాదం కలిగించే ప్రేమే. వాడిముల్లులామారి హృదయాన్ని గాయపరచగలదు.

కృష్ణ వెళ్ళిపోగానే నీరసం ముంచుకొచ్చిన ప్రేమ ఇంటిదారి పట్టింది. కృష్ణ ఫోటో చేతబట్టుకొని మంచం మీద వాలింది.

"మా ఆయన నీలాగే డాక్టరే కృష్ణా! డాక్టరే!" పదేపదే అంటూ కారేకన్నీటిని తుడుచుకుంది "బాధ్యతలు మీద పడితే నిన్ను కాదన్నాగానీ, వేరే పెళ్ళి ఎలా చేసుకుంటాననుకున్నావు? నువ్వయితే నన్ను మర్చిపోయి హాయిగా పెళ్ళాడావు గానీ......"

○ ○ ○

ఆస్పత్రి చేరేసరికే నీరసం వచ్చింది కృష్ణకి. రోగులని నర్సుకి. కాంపౌండరుకి అప్పగించి తన రూమ్‌లోకి వెళ్ళాడు. వాలుకుర్చీలో కూర్చునే సరికి ఎదురుగా ప్రేమ ఫోటో. "ప్రేమా! ప్రేమా! సాక్షాత్తూ లక్ష్మిలాంటి మా ఆవిడవు నీవే! దురదృష్టవంతుడినికాబట్టి నిన్ను పొందలేకపోయాను నన్నెలా మరువగలిగావు ప్రేమా? వేరే పెళ్ళెలాచేసుకున్నావు నాటికి, నేటికి, నీ కోసమే మిగిలిపోయాను నేను. నీ కోసమే నీ కోసమే......" బరువుగా కనురెప్పలు వాలిపోయాయి.

పక్కింట్లో రేడియో పెట్టారెవరో. "నీ కోసం వెలసింది ప్రేమ మందిరం..." మధురంగా వినిపిస్తోంది స్వర్గీయ ఘంటసాలగారి కంఠం.